రుణమాఫీపై కొత్త మెలిక

- మాఫీకాని రైతులు ఏఈవోలను కలవాలని ఉత్తర్వులు
- ఫిర్యాదుల పరిష్కారానికి 30 రోజుల గడువు
- బ్యాంకర్లు, వ్యవసాయ అధికారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- త్వరలో మరో జాబితా వస్తుందని చెప్తున్న బ్యాంకర్లు
- ఇన్ని లోపాలెలా జరిగాయని రైతుల ప్రశ్న

సిద్దిపేట జిల్లా పుల్లూరులోని ఏపీజీవీబీ బ్రాంచ్‌కు శుక్రవారం రైతులు భారీగా తరలివచ్చారు. రుణమాఫీ జాబితాలో తమపేర్లు ఉన్నాయా, ఖాతాల్లో డబ్బులు పడ్డాయా అనే విషయాన్ని బ్యాంకు మేనేజర్‌ను అడిగితెలుసుకున్నారు. కొందరి పేర్లు జాబితాలో రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. కొందరికి మెసేజ్‌లు రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పూర్తి వివరాలు వచ్చాక అన్ని విషయాలు చెబుతామని బ్యాంకు సిబ్బంది తెలిపారు.

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రైతు రైతుమాఫీపై వ్యవసాయ శాఖ శుక్రవారం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎవరైన రైతులకు రుణమాఫీ కాకపోతే, ఆయా రైతులు మండల వ్యవసాయాధికారులను కలిసి ఫిర్యాదుచేయాలని మెలిక పెట్టింది. ఆయా ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలను ఇప్పటికే జిల్లా వ్యవసాయాధికారులకు జారీ చేసినట్టు పేర్కొన్నది. 'ఎవరైనా రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ జరగకపోతే, ఆయా రైతులు ఆందోళన చెందకుండా మీ పరిధిలోని మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగలరు. రైతు రుణమాఫీ-2024కు గాను ప్రతి మండలంలో రుణమాఫీ ఫిర్యాదుల విభాగాన్ని మండల వ్యవసాయ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా జూలై 18న ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి సంబంధించిన ఆదేశాలను జిల్లా వ్యవసాయ అధికారి జిల్లాలో ఉన్న ప్రతి మండల వ్యవసాయ అధికారికి అదే రోజున జారీ చేయడం జరిగింది. రైతులు ఇచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం నిర్దేశించిన 30 రోజుల్లోగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుంది. పంటరుణం తీసుకున్న, రుణమాఫీకి అర్హులైన (తేదీ 12-12-2018 నుంచి 9-12-2023 మధ్య కాలంలో రైతులు పంట రుణం తీసుకున్న పంట రుణ మాఫీ 2024కు అర్హులు) ప్రతి రైతుకు సంబంధించిన పంట రుణం సమాచారం, స్థితి తెలుసుకోవడానికి జిల్లాలో క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రతి వ్యవసాయ విస్తర్ణ అధికారికి, మండల పరిధిలో ఉన్న ప్రతి మండల వ్యవసాయ అధికారికి లాగిన్స్ వ్యవసాయ శాఖ నుంచి ఇచ్చాం. రైతులు ఆధార్ నంబర్‌ను ఏఈవో, లేదా ఎంఈవోకు ఇస్తే పంట రుణమాఫీ 2024 రైతు సమాచారాన్ని తెలుసుకోవచ్చు' అని జిల్లా వ్యవసాయ అధికారుల నుంచి ప్రకటనలు వెలువడ్డాయి. దీనిని బట్టి రైతుల్లో కొందరికి రుణమాఫీ జరగలేదని స్పష్టం అవుతున్నదని నిపుణులు చెప్తున్నారు.

కార్యాలయాలు కిటకిట

రుణమాఫీ జాబితాలో పేర్లు రాని రైతులు శుక్రవారం మండల, జిల్లా వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లారు. తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం రాష్ట్రంలో ఏ వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని పరిశీలించినా ఇదే దృశ్యం కనిపించింది. వారికి ఏమని సమాధానం చెప్పాలో తెలియక వ్యవసాయ అధికారులు తలలు పట్టుకున్నారు. రైతుల ఆధార్ వివరాలతో డాటాబేస్‌ను చెక్ చేసి, రుణమాఫీ కానివారి నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ ఫిర్యాదులను ఏం చేస్తారని ప్రశ్నిస్తే.. పై అధికారులకు పంపుతామని, ఎప్పుడు మాఫీ అవుతుందో తెలియదని సమాధానం వచ్చింది. మరికొన్నిచోట్ల రైతులు బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాలోని రుణం మాఫీ అయ్యిందో లేదో మరోసారి చూడాలని అధికారులను విజ్ఞప్తిచేయడం కనిపించింది. కరీంనగర్ జిల్లాలో కొందరు బ్యాంకర్లు 'ఇప్పుడు వచ్చింది మొదటి జాబితా మాత్రమే. త్వరలో కొత్త జాబితా వస్తుంది. అందులో మీ పేర్లు ఉండే అవకాశం ఉన్నది' అంటూ సముదాయించి పంపుతున్నారు. ఇది వాస్తవమేనా? అని 'నమస్తే తెలంగాణ' ఆరా తీయగా 'మా పై అధికారులు కూడా ఇదే చెప్తున్నారు. మార్పులు, చేర్పులతో త్వరలో కొత్త జాబితా వస్తుందని చెప్తున్నారు' అని ఒక బ్యాంకు అధికారి పేర్కొన్నారు.

పక్కాగా లెక్కలు, వివరాలు

రాష్ట్రంలో పంట రుణాల మంజూరు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నది. రైతుల పంట రుణం వివరాలు, వారి బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్, పాస్‌బుక్ నంబర్.. వంటివన్నీ బ్యాంకర్ల దగ్గర ఉన్నాయి. ఈ వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖకు, రెవెన్యూ శాఖకు చేరుతున్నాయి. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పక్కాగా ఉంటాయి కాబట్టి.. ఒక్క క్లిక్‌తోనే డాటా మొత్తం వస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఇంత పక్కాగా వివరాలు ఉన్నా లోపాలు ఎందుకు జరిగాయని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం డిసెంబర్‌లో అధికారంలోకి రాగానే రుణమాఫీ కసరత్తు మొదలుపెట్టింది. అప్పటినుంచే రైతుల వివరాలు సేకరించి, పరిశీలిస్తున్నది. ఏడు నెలల సమయం దొరికినా, ఎందుకు కచ్చితమైన వివరాలు సేకరించలేకపోయారని ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. రుణమాఫీ కానివారు మండల కార్యాలయంలో ఫిర్యాదు చేయాలనడంపై రైతులు మండిపడుతున్నారు. వివరాలన్నీ బ్యాంకుల దగ్గర ఉన్నప్పుడు ఎందుకు మళ్లీ దరఖాస్తు చేయాలని ప్రశ్నిస్తున్నారు. వీటిపై ఎప్పుడు మోక్షం కలుగుతుందో? ఎప్పుడు మాఫీ అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మోసం చేసినందుకా సంబురాలు?

- రుణమాఫీ అయిన రైతులకన్నా.. కంటతడి పెట్టిన వాళ్లే ఎక్కువ
- ఇప్పటిదాకా అటెన్షన్ డైవర్షన్, ఇప్పుడు ఫండ్స్ డైవర్షన్
- రైతు రుణమాఫీపై ఎక్స్‌లో కేటీఆర్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణ మాఫీ 'చారాణ కోడికి బారాణ మసాలా' చందంగా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు వ్యాఖ్యానించారు. రైతు రుణ మాఫీపై శుక్రవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. ఊరించి, ఊరించి, ఏడు నెలలు ఏమార్చి చేసిన రుణమాఫీ తీరు చూస్తే.. తెలంగాణ ప్రజలకు గుర్తొచ్చిన సామెత 'చారాణ కోడికి.. బారాణ మసాల' అని పేర్కొన్నారు. రుణమాఫీ అయిన రైతులకన్నా, కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువ అని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు.. రైతుమాఫీ పథకానికి మరణ శాసనాలయ్యాయని విమర్శించారు. కొంత మంది రైతులకు అన్నివిధాలా అర్హత ఉన్నా.. వారికి రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పేటోడు లేడని ఆరోపించారు. రైతులు గోడు చెప్పుకుందామంటే వినేటోడు లేడని మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులు రుణమాఫీ కాక, అంతులేని ఆందోళనలో ఉంటే మరోవైపు ప్రభుత్వం సంబురాలు జరుపుకోవడం ఎందుకని ప్రశ్నించారు. '40 లక్షల మంది అర్హులైన రైతుల్లో మెజారిటీ రైతులకు నిరాశే మిగిల్చినందుకా..? ముప్పై లక్షల మందిని మోసం చేసినందుకా?' ఎందుకు ఈ సంబురాలు అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు అయినా.. ఇంతవరకు రైతుభరోసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'జూన్‌లో వేయాల్సిన రైతుభరోసా.. జూలై వచ్చినా రైతుల ఖాతాలో వెయ్యలే.. కౌలు రైతులకు ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యనే ఇయ్యలే.. రైతు కూలీలకు.. రూ.12 వేల హామీ ఇంకా అమలే చెయ్యలేదు' అని విమర్శించారు. కాంగ్రెస్ పాలన గురించి.. ఒక్క మాటలో చెప్పాలంటే.. 'ఇంతకాలం.. అటెన్షన్ డైవర్షన్.. ఇప్పుడేమో.. ఫండ్స్ డైవర్షన్' అని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్‌దే ఆల్‌టైం రికార్డు

రైతుల ఖాతాల్లో 1.2 లక్షల కోట్లు: ఎక్స్ వేదికగా హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఖాతాల్లో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1.2లక్షల కోట్లు జమచేశామని, ఇది దేశ చరిత్రలో ఆల్ టైం రికార్డ్ అని, ఆ పదేండ్లు సాగుకు స్వర్ణయుగమని మాజీ మంత్రి హరీశ్‌రావు వివరించారు. 69 లక్షల మంది రైతులకు రైతుబంధు ద్వారా రూ.72,972 కోట్లు, 1.11 లక్షల మందికి రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ.6,488 కోట్లు, రెండు దఫాల్లో రుణ మాఫీ కింద రూ.29,144.61 కోట్లు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా 11.401 కోట్లు రైతుల అకౌంట్లలో వేశామని శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ పథకాల ద్వారా రైతులకు అందిన ఆర్థిక సాయం రూ.1,20,005 కోట్లు అని తెలిపారు. ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఏడు నెలలుగా జీతాలందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటి కిరాయి చెల్లించడం కూడా వారికి భారంగా మారిందని, పీఎఫ్ సైతం జమ కావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ సర్కారుకు ఈ చిరుద్యోగుల వెతలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కోవ లక్ష్మి

లక్ష రుణమాఫీ కానోళ్లు లక్షల్లోనే..

గోబెల్స్ ఉంటే కాంగ్రెస్ అబద్ధాలకు ఆత్మహత్య చేసుకునేటోడు

రేవంత్ సర్కారు చేసింది గోరంత.. చెప్పేది కొండంత

కేసీఆర్ హయాంలో రైతుల ఖాతాల్లోకి లక్ష కోట్లు: ఎమ్మెల్యే పల్లా

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ గోరంత అయితే చెప్పేది కొండంత ఉందని, గోబెల్స్ బతికి ఉంటే కాంగ్రెస్ చెప్పే అబద్ధాలను చూసి ఆత్మహత్య చేసుకునేటోడని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసింది ఆరువేల కోట్లేనని, మొత్తం రుణాలున్న రైతుల్లో 30 శాతం మందికే రుణమాఫీ అయిందని, డబ్బుల పరంగా చూస్తే ఇది కేవలం 20 శాతం మాత్రమేనని, ఇంకా లక్ష రుణం మాఫీకాని రైతులు లక్షల్లో ఉన్నారని తెలిపారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో పల్లా మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో మొదటి విడతలో 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్ల రుణమాఫీ చేశామని, రెండో విడత 37.33 లక్షల మందికి రూ.19 వేల కోట్లు సిద్ధం చేసుకొని రూ.12 వేల కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. ఇంకా ఏడు వేల కోట్లపై కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేయడంతో ఆ మొత్తం చెల్లించకుండా ఆగిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ ఏడు వేల కోట్లు ఇప్పుడు మంత్రుల కాంట్రాక్టు సంస్థలకు వెళ్లాయని ఆరోపించారు. లక్ష లోపు రుణాల మొత్తం కేసీఆర్ హయంలో రూ.19 వేల కోట్లుంటే ఇపుడు 6వేల కోట్లకు ఎలా తగ్గిందని, దాదాపు 40 లక్షల మంది లబ్ధిదారులుంటే 11లక్షల మందికే రుణమాఫీ ఎలా చేశారని ప్రశ్నించారు. ఆంక్షల పేరిట రుణమాఫీని కొందరు రైతులకే పరిమితం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రైతుల అకౌంట్లలో సంక్షేమ పథకాల కింద లక్ష కోట్లు జమయ్యాయని, ఇందులో 72 వేల కోట్లు రైతు బంధు ద్వారా, 28 వేల కోట్లు రుణమాఫీ కింద జమ చేశామని చెప్పారు. రైతులకు కేసీఆర్ పాలన ఆనం దాన్నిస్తే కాంగ్రెస్ ఆందోళన మిగిల్చిందని విమర్శించారు. కేసీఆర్ కట్టిన 2604 రైతు వేదికల్లో కాంగ్రెస్ సంబురాలు చేసుకున్నదని, కేసీఆర్ కట్టిన సచివాలయం నుంచే సీఎం రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. పంట సీజను దాటుతున్నా రైతు భరోసా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు.

హరీశ్‌రావు సవాల్‌ను వక్రీకరించారు

హరీశ్‌రావు రాజీనామా సవాల్‌ను సీఎం, కాంగ్రెస్ నేతలు వక్రీకరించారని పల్లా తెలిపారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలతో పాటు రైతు రుణమాఫీని ఆగస్టు 15 లోగా అమలు చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ విసిరారని గుర్తుచేశారు. ఇప్పటికీ హరీశ్‌రావు ఆ సవాల్‌కు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. రాజీనామాల నుంచి పారిపోయింది రేవంత్ అని, నిలకడగా నిలబడ్డది హరీశ్‌రావు మాత్రమేనని పల్లా తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కోవా లక్ష్మి, బీఆర్ఎస్ నేతలు రాకేశ్‌రెడ్డి, రాంబాబు యాదవ్, తుంగ బాలు పాల్గొన్నారు.

'రుణ విముక్తి' కలగలే..!

బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

రంగారెడ్డి జిల్లాలో రుణమాఫీ జాబితాలో వేల మంది రైతుల పేర్లు గల్లంతు

రంగారెడ్డి, జూలై 19(నమస్తే తెలంగాణ): 'నందిగామ మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నవారు 33 మంది ఉండగా..12 మందికి మాత్రమే రుణమాఫీ అయింది.'

'చేగూరు పీఏసీఎస్‌లో రూ.లక్షలోపు రుణాలను 264 మంది తీసుకోగా.. అందులో 156 మందికి మాత్రమే రుణ మాఫీ అయింది.' రుణ విముక్తి కలగని రైతులు రంగారెడ్డి జిల్లాలో పెద్ద మొత్తంలో ఉన్నట్టు తెలుస్తున్నది. జిల్లాలో 49,741 మంది రైతులకు రూ.278.06 కోట్ల రుణ మాఫీ చేసినట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. చాలా మంది రైతుల పేర్లు జాబితాలో గల్లంతయ్యాయని, అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదని ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాని కారణాలను తెలుసుకునేందుకు శుక్రవారం బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలకు పరుగులు పెట్టారు. హైదరాబాద్ నుంచే జాబితాలు వచ్చాయని, తమకేమీ తెలియదని అధికారులు చెబుతున్నారు. మొదటి విడత పరిస్థితే ఇలా ఉంటే.. రెండు, మూడో విడత పరిస్థితి ఎలా ఉంటుందో నన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీకాని వాటిలోమచ్చుకు కొన్ని..

- నందిగామ మండలం మేకగూడ పీఏసీఎస్ పరిధిలో 306 మంది రైతులు రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నారు. వీరిలో 181 మంది రైతులకే రుణ మాఫీ అయింది.
- షాద్ నగర్ పీఏసీఎస్ పరిధిలో 313 మందికి రూ.లక్ష లోపు రుణమాఫీ వర్తించాల్సి ఉండగా.. కేవలం 174 మంది పేర్లే జాబితాలో ఉన్నాయి.
- కొందుర్గు పీఏసీఎస్ పరిధిలో 1,005 మందికి రూ.లక్ష రుణమాఫీ కావాల్సి ఉండగా 372 మందికే రుణమాఫీ జరిగినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.
- కేశంపేట మండలం కొత్తపేట పీఏసీఎస్ పరిధిలో రూ.లక్ష రుణమాఫీకి 470 మంది అర్హులుకాగా..తొలి జాబితాలో 236 మందికే రుణ విముక్తి కలిగింది.

రుణమాఫీపై చెప్పిందెంత.. చేసిందెంత?

- రైతులను దగా చేసిన రేవంత్ సర్కార్
- ఏదో ఘనకార్యం చేసినట్టు సంబురాలెందుకు?
- కొండను తవ్వి ఎలుకను పట్టినందుకా?: వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): 'డిసెంబర్ 9న చేయాల్సిన రూ.2 లక్షల రుణమాఫీని ఏడు నెలలు ఆలస్యం చేసి, రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ అని గొప్పలు చెప్పుకొని తీరా రూ.6వేల కోట్లే మాఫీచేసి సంబురాలు చేసుకుంటూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది' అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేర కు వానకాలం సీజన్‌కు ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాల్సిన రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి, ఆ డబ్బుల్లోంచి రుణమాఫీ కింద రూ.6,098 కోట్లు విదిల్చి ఏదో ఘనకార్యం చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నదని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో దుయ్యబట్టారు.'కొండను తవ్వి ఎలుకను పట్టినందుకు సంబురాలు చేసుకోవాలా?.. కాంగ్రెస్ చేసిన మోసానికి రైతులు సంబురాలు చేసుకోవాలా? రైతు రుణమాఫీపై కాంగ్రెస్ చెప్పిందెంత? రేవంత్‌రెడ్డి సర్కార్ ఇస్తున్నదెంత?' అని ప్రశ్నించారు. రైతు సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉన్నదని ఎద్దేవాచేశారు. కేసీఆర్ ఏమీ చేయలేదని.. అంతాతామే చేస్తున్నామనే భ్రమల నుంచి కాంగ్రెస్ సర్కార్ బయటకు రావాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రపంచంలోనే ఏ రాజకీయ నేత చేయని కార్యక్రమాలు కేసీఆర్ చేసి చూపించారని గుర్తుచేశారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్, ధాన్యం కొనుగోళ్లు, రెండు విడుతల్లో రూ. 28,000 కోట్ల రుణమాఫీ, మిషన్ కాకతీయ వంటి అనేక పథకాలు అమలు చేసి ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాల ప్రశంసలు పొందారని గుర్తుచేశారు. దేశాన్ని 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

రైతంటే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు.. కేసీఆర్‌కు బాధ్యత

రైతు చేతిలో పురుగు మందు డబ్బాలు, రాత్రిపూట పొలాల్లో పాముకాట్లు కేసీఆర్ పాలనలో బందయ్యాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు 37 లక్షల మంది ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు, లోన్ రీ షెడ్యూల్, ఆదాయపు పన్నుల పేరిట 26 లక్షల మందిని ఏరిపారేసిందని ఆరోపించారు. కేసీఆర్ రెండు విడతల్లో చేసిన రుణమాఫీతో రైతులకు ఏ స్థాయిలో మేలు జరిగిందో వివరించేందుకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను ఉదహరించారు. ఆ జిల్లాల్లో రెండుసార్లు కలిపి లక్షలోపు రుణాలున్న 5,75,177 మంది రైతులకు రూ. 2518 కోట్ల మాఫీ చేశారని గుర్తుచేశారు. ఆవే జిల్లాల్లో కాంగ్రెస్ సర్కారు ప్రస్తుతం 94,566 మంది రైతులకు రూ. 459 కోట్లు మాత్రమే రుణమాఫీ చేస్తున్నదని వివరించారు. ఈ లెక్కన ఎవరు ఎక్కువ మొత్తం మాఫీ చేశారని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు

మాటలకు చేతలకు పొంతనేది

- బొరంపేటలో 11 మందికే మాఫీ
- ప్రకటనలకు కోట్లు కుమ్మరించారు
- కాంగ్రెస్‌కు ముందుంది ముసళ్ల పండుగ: కేపీ వివేకానంద
- సీఎంఆర్ఎఫ్ విషయంలోనూ వివక్ష: కోవ లక్ష్మి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా బొరంపేట ప్రాథమిక సహకార సంఘంలో రుణాలు తీసుకున్న వారిలో 11 మందికి మాత్రమే మాఫీ అయ్యాయని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్న మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన ఉండటంలేదని దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీపై రేవంత్ దేవుళ్లపై ఒట్టు వేసి వాటిని నిలుపుకోవడానికి తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. పైసాపైసా కూడబెట్టాం, నిద్ర లేని రాత్రులు రుణమాఫీ కోసం గడిపామంటున్న సీఎం.. అంత కష్టపడి కూడబెడితే రూ.వంద కోట్లు ప్రకటనలకు ఎందుకు ఖర్చు పెట్టారని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రకటనల కోసం వృథాగా డబ్బులు ఖర్చు పెడుతున్నారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ప్రకటనల కోసం ఖర్చు చేస్తున్న డబ్బు రేవంత్ తాతదా? అని మండిపడ్డారు. బొరంపేట ప్రాథమిక సొసైటీలో 632 మంది సభ్యులు ఉంటే, అందులో 500 మంది వరకు రూ.లక్ష లోపు రుణమాఫీకి అర్హులని, కానీ, 11 మందికే మాఫీ అయిందని వివరించారు. దూలపల్లి పీఏసీఎస్ కూడా చాలా తక్కువ మందికే రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం అందరికీ రుణమాఫీ చేసినట్టుగా చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. రైతులు కాంగ్రెస్‌ను వదిలిపెట్టరని, ముందుంది కాంగ్రెస్‌కు మొసళ్ల పండగ అని హెచ్చరించారు.

ఆరోగ్యంతో రాజకీయమా: కోవ లక్ష్మి

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఒక్క పైసా రాలేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలకు ఒక న్యాయం ఇతర పార్టీలకు ఒక న్యాయం అన్నట్టుగా ఉన్నదని విమర్శించారు. సీఎంఆర్ఎఫ్ విషయంలోనూ వివక్ష చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయంలోనూ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిలాగా వ్యవహరించాలి తప్ప పీసీసీ అధ్యక్షుడిగా కాదని సూచించారు. కేసీఆర్ హాయంలో ఎమ్మెల్యేలందరినీ ఒకేలా చూశారని గుర్తుచేశారు. రైతుభరోసాపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయాలు మాత్రమే తీసుకుంటున్నదని ఆరోపించారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

తెలంగాణ చౌక్, జూలై 19: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లోని సీపీఐ ఆఫీసు బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సింగరేణిని ప్రైవేట్ పరంచేసే కుట్రతోనే కేంద్రం బొగ్గుబ్లాకుల వేలానికి తెరలేపిందని ఆరోపించారు. కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ప్రాణిహిత చేవేళ్లకు జాతీయ హోదా, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లుపెట్టే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపాలని కోరారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, రాష్ట్ర సభ్యుడు పోనగంటి కేదారి, సృజన్‌కుమార్, అశోక్‌కుమార్ ఉన్నారు.

నిబంధనల సాకుతో రుణమాఫీకి ఎగనామం

నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, జూలై 19: నిబంధనల సాకుతో రైతుల రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెట్టిందని నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేవలం రూ. 6 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేసి రూ.31 కోట్లు మాఫీ చేసినట్టు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో రూ.16 వేల కోట్లతో 35లక్షల మందికి, 2023లో రూ.19 వేల కోట్లతో 38 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా, పట్టణాధ్యక్షులు, తోట ఆగయ్య, జిందం చక్రపాణి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్ ఉన్నారు.

రుణమాఫీ షరతులతో రైతులకు అన్యాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

నిడమనూరు, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం షరతులతో కూడిన రుణమాఫీ చేయడంతో అర్హులైన పేద రైతులకు అన్యాయం జరుగుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సాంకేతిక కారణాలతో ధరణిలో నమోదు కాని భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ కాలేదని, ఈ కారణంగా రైతులకు రుణమాఫీ వర్తింప చేయకపోవడం సరికాదని హితవుపలికారు. పంట పెట్టుబడుల కోసం పేద రైతులు, కౌలు రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగారని, బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారని తెలిపారు. వారందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీ ఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్ ఉన్నారు.

కూతురు